క్లుప్తంగా

ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో సోమవారం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 130 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 98 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమై 12 గంటలకు ముగిసింది. రాష్ట్ర ఏపీ మోడల్ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ రవిసాగర్ పాఠశాలను సందర్శించి ప్రవేశ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయనతో పాటూ ప్రిన్సిపల్ ఝాన్సీవాణి ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి ఫలితాల వెల్లడి, అనంతరం ఆరో తరగతిలో విద్యార్థులకు అడ్మిషన్లు ఖరారు చేస్తామన్నారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతం



రొంపిచర్ల : మండలంలో వి.రెడ్డిపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్ లో సోమవారం 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ పరీక్షకు నరసరావుపేట, నకరికల్లు, రొంపిచర్ల, ఈపూరు మండలాల నుంచి మొత్తం 221 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 209 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. స్కూల్‌లో జరుగుతున్న పరీక్షను ఎంఈవో డి. బ్రహ్మేశ్వరరావు పరిశీలించారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. ప్రభుదాస్, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ కె. ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం-చిలకలూరిపేట డొంక రోడ్డులో కుప్పగంజివాగు పక్కనే కొలువైయున్న శ్రీ లక్ష్మీగణపతి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు పూజారి కొండవీటి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం స్వామివారిని అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అదేరోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. సాయంత్రం హైస్కూలు విద్యార్థులచే కోలాట ప్రదర్శన జరగనుంది. 2015లో గ్రామానికి చెందిన గాలి సాంబయ్య వాయుప్రతిష్ట నిర్వహించగా, 2021లో ఆలయాన్ని పునర్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు.

ఎస్టీ కాలనీకు లోఓల్టేజీ సమస్య

శావల్యాపురం: మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీవాసులు లోఓల్టేజీ సమస్య కారణంగా గత వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని, గత వారం రోజుల క్రితం ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందని, కాలనీ వాసులు విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా తాత్కాలికంగా వేరు మార్గం ద్వారా విద్యుత్ సరఫరా ఇచ్చినట్లు తెలిపారు. దీంతో లోఓల్టేజీ సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. సత్వరమే విద్యుత్ అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గొరిజవోలు అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



నాదెండ్ల: ఐసీడీఎస్ ప్రాజెక్టు సాతులూరు సెక్టార్ పరిధిలోని గొరిజవోలు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్‌డే, పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె పద్మ, ఎంపీపీఎస్ హెచ్‌ఎం పి.అనురాధ హాజరయ్యారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి ఒకటో తరగతిలో చేరేందుకు అడ్మిషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పద్మ మాట్లాడుతూ మూడేళ్ల నిండిన చిన్నారులను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో, ఐదేళ్లు నిండి అంగన్‌వాడీలో చదువుకున్న విద్యార్థులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

బహుళ ప్రయోజనం.. అయినా నిష్ప్రయోజనం

- ప్రారంభానికి నోచుకోక గోదాములు నిరుపయోగం
- ఉండీ రైతుకు ఉపయోగపడని వైనం



వడ్లు ఆరబెట్టుకొనే సిమెంట్ ప్లాట్ ఫాం



నిర్మాణం పూర్తయిన గిడ్డంగి

నూజెండ్ల: రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన బహుళ ప్రయోజన గోదాములు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మిగిలిపోయాయి. జిల్లా, నియోజక వర్గ పరిధిలో గిడ్డంగి సౌకర్యం ఉన్నప్పటికీ మారుమూల ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి. పండించిన పంట గోదాములకు చేర్చాలంటే అయ్యే వ్యయ ప్రయాసలు దృష్టిలో ఉంచుకుని గిట్టుబాటు ధర ఉన్నా లేకున్నా రైతులు తమ దిగుబడులు మార్కెట్‌లో ఉన్న ధరకే తమ ఉత్పత్తులు అమ్మేసుకుంటున్నారు.

రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని అప్పటి ప్రభుత్వం రైతులకు అందుబాటులో గిడ్డంగి సౌకర్యం కల్పించాలని మండల కేంద్రాల్లో బహుళ ప్రయోజన గోదాములు నిర్మించారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన నూజెండ్లలో 42 లక్షల నాబార్డు నిధులతో వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గిడ్డంగి, వడ్లు ఆరబెట్టుకోవడానికి సిమెంట్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. అయితే నిర్మాణం పూర్తయిన సంవత్సర కాలం గడచినా ప్రారంభానికి నోచుకోలేదు. రైతులకు వ్యవసాయ సీజన్ మాత్రం గడిచిపోయింది. గిడ్డంగి అందుబాటులో రాకపోవటంతో పండించిన పంట తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సొసైటీ అధికారులు స్పందించి గోదాములు అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఉపయోగం లేకుండా పోయింది



మండల కేంద్రంలో వ్యయసాయ గిడ్డంగి సౌకర్యం ఉన్నప్పటికీ ఉపయోగించుకోలేకపోతున్నాం. పండించిన పంట తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చింది. స్థానికంగా నిర్మించిన గోదాములు వెంటనే ప్రారంభిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– యనమదల చిరంజీవి, రైతు, నూజెండ్ల

నిల్వ చేసుకోలేక వచ్చిన ధరకు అమ్మేశా



ఈ ఏడాది 20 ఎకరాల్లో వరి సాగు చేశా. ధాన్యం నిల్వ చేసుకోవడానికి సౌకర్యం లేకపోవటంతో వచ్చిన ధరకే ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మొక్కజొన్న, మినుము పంట చేతికొచ్చే దశలో ఉంది. గిడ్డంగి సౌకర్యం అందుబాటులోకి వస్తే గిట్టుబాటు ధర వచ్చే వరకూ వేచి చూడవచ్చు.

– బొల్లినేని శ్రీనివాస రావు, రైతు, నూజెండ్ల

అనుమతులు వస్తే అప్పగిస్తాం

బహుళ ప్రజా గోదాము నిర్మించిన గుత్తేదారు పూర్తయిన నిర్మాణాన్ని స్థానిక సొసైటీ అధికారులకు అప్పగించాల్సి ఉంది. అనుమతులు రాగానే త్వరలో గిడ్డంగి సౌకర్యాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఇటువంటి గోదాములు జిల్లాలో 50 వరకూ ఉన్నాయి. ప్రస్తుతం వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

– యం.వెంకటరమణ, డీసీవో, పల్నాడు జిల్లా

వివాదాలకు తావులేకుండా ఐకమత్యంగా ఉండాలి



బొల్లాపల్లి: గ్రామంలో వివాదాలకు తావు లేకుండా ఐకమత్యంగా కలసి మెలిసి జీవించాలని బండ్లమోటు ఎస్సై ఏ బాలకృష్ణ సూచించారు. మండలంలోని గుట్లపల్లి గ్రామంలో నాకాబందీ సోమవారం సాయంత్రం నిర్వహించారు. అనుమానిత ప్రదేశాలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ గొడవలు అల్లర్లకు పాల్పడ కుండా ప్రశాంతంగా జీవన విధానం కొనసాగించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట ఆహుతి

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో ఎకరం పొలంలో ఏర్పాటు చేసిన వరి పంట గూడుకు గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టిన సంఘటన సోమ వారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన సాదినేని వీరాంజనేయులు గ్రామ సమీపంలో ప్లాంటు వద్ద వరి పంటను కోత కోసి గూడు కట్టుకున్నాడు. ఈక్రమంలో తెల్లవారుజామున పొలానికి వెళుతున్న రైతులకు గూడు తగలపడుతుండటం గమనించి సమాచారాన్ని తెలియజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాత్ముడికి మోకరిల్లి... సమస్యలపై నినదించి..

- గాంధీ విగ్రహం వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిరసన
- 33వ రోజుకు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల దీక్షలు



మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: పూర్తివేతనాలు చెల్లించాలని కోరుతూ గత 33 రోజుల నుంచి తాము నిరసన దీక్షలు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోనందుకు నిరసనగా సోమవారం కార్మికులు వినూత్న రీతిలో మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మోకరిల్లి నిరసన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌లో ఉన్న తమను బదిలీ కార్మికులమంటూ మున్సిపల్ అధికారులు తమపై వేధింపులకు పాల్పడడం ఏ మాత్రం తగదని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన చెందుతున్నారు. గత ఆరేళ్లుగా పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్నప్పటికీ నెల మొత్తం పనిచేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే వేతనాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారంతో 33 రోజుకు చేరుకున్నా యి. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కార్మికులు పోరాటం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న శ్రీనివాసరావు, నాగేశ్వరరావు

నరసరావుపేట ఈస్ట్: జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ, తమ విద్యార్థులు రాట్ల జాస్పర్ 650, ఆకుల సాయి 1200, గుండాల సిరి 1545, కొలకోట్ల మహేష్ 4155, రమావత్ మోహన్ 5250, గుండాల యువరాజ్ 7245 ర్యాంక్ సాధించినట్టు తెలిపారు.

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీలలో టాప్ 20 కళాశాలల్లో సీట్లు వస్తాయని వివరించారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా తమ విద్యార్థులు ర్యాంకులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులు పరిశీలన

నూజెండ్ల: నాణ్యతా ప్రమాణాలు పాటించని పనులకు బిల్లులు నిలిపివేస్తామని క్వాలిటీ కంట్రోల్ డీఈ శౌరిరాజు అన్నారు. మండలంలోని ముప్పరాజుపాలెం, జెసి నగర్, ఐనవోలు, నాగిరెడ్డిపల్లె, భూమాయిపాలెం తదితర గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో జరిగిన పనులను తనిఖీ చేశారు. డీఈ శౌరిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన సిమెంట్ రోడ్లు కోర్ ను కంప్రెసివ్ స్ట్రెంత్ టెస్టింగ్ మెషిన్ ద్వారా తీసి లాబ్‌కు పంపటం జరుగుతుందన్నారు. పరీక్షల్లో నిబంధనలకు లోబడి నాణ్యతా ప్రమాణాలు ఉన్నట్లు నిర్ధారణ జరిగితేనే బిల్లులు చెల్లింపు జరుగుతుందన్నారు. ఆయనతో పాటు జేఈలు రమేష్, సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ అల్లాబక్షు ఉన్నారు.

పిల్లలూ.. రండి.. రండీ!!

నూతన విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు



విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇస్తున్న హెచ్‌ఎం విజయకుమారి

రొంపిచర్ల: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో నూతనంగా వచ్చి చేరుతున్న విద్యార్థులకు సోమవారం స్వాగతం పలికారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో 2025–26 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో నూతనంగా చేరుతున్న విద్యార్థులకు, ప్రమోట్ అయ్యే విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలుకుతూ, స్వీట్స్ పంపిణీ చేశారు. మండలంలో అన్నవరం గ్రామంలో గల ఎంపిపి(ఎఎ)స్కూల్, వి.రెడ్డిపాలెం ఎంపీపీఎస్, వడ్లమూడివారిపాలెం ఎంపీయూపీఎస్, తుంగపాడు ఎంపీపీఎస్, సంతగుడిపాడు ఏపీపీఎస్ఏపి, పలు గ్రామాలలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 డి.బ్రహ్మేశ్వరరావు పాల్గొని నూతనంగా చేరుతున్న విద్యార్థులకు, ప్రమోట్ అయ్యే విద్యార్థులకు స్వాగతం పలికి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో నాలుగు దుకాణాలు దగ్ధం



చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పలు దుకాణాలు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. పట్టణంలోని సుభానినగర్ లాహిరి ఆస్పత్రి పక్కనే ఉన్న పిల్లల ఆటవస్తువులు విక్రయించే దుకాణాలు దగ్ధమయ్యాయి. కొన్నేళ్ల కిందట అందెల సుమంత్ కోటిబాబు ప్లాస్టిక్ ఆటవస్తువులు విక్రయాలకు వరసగా ఉన్న మూడు దుకాణాలు అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వ్యాపారం అనంతరం దుకాణం మూసివేసి ఇంటి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో సదరు దుకాణంలో నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి దుకాణం యజమాన్ని కోటిబాబుకు, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటన చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే దుకాణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

ఆటోనగర్ సమస్యను పరిష్కరించండి

పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేసిన ఆటో వర్కర్ల యూనియన్ ప్రతినిధులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటోవర్కర్లు

నరసరావుపేట: ఆటోనగర్ సమస్యను పరిష్కరించాలని ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం టౌన్‌హాలులో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులకు వినతిపత్రం సమర్పించారు. దీనికోసం ఇప్పటికే ఉప్పలపాడు వద్ద 60 ఎకరాలు సేకరించటం జరిగిందని, త్వరలో శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే చదలవాడ వర్కర్లకు హామీ ఇచ్చారు.

పల్నాడు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వాసుపత్రి ఎదురుగా పొక్లయినర్‌తో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

నరసరావుపేట: పల్నాడురోడ్డులో దక్షిణంభాగంలో పాత ప్రభుత్వాసుపత్రి నుంచి రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటుచేసిన ఆక్రమణలను సోమ వారం నుంచి తొలగించటం ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా ప్రదేశాల్లో ఆక్రమణలను స్వచ్ఛందంగా తీసేయాలని పలుమార్లు మైక్ అనౌన్స్‌మెంట్లు, ఇతర మార్గాల ద్వారా హెచ్చరించటం జరిగిందన్నారు. అయినప్పటికీ ఇంకా ఉన్న ఆక్రమణలను ప్రొక్లయినర్ సహాయంతో మున్సిపల్ సిబ్బంది తొలగిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం అంబేద్కర్ కాలనీలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి నాలుగో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 1980లో నిర్మించిన చర్చి శిథిలావస్థకు చేరటంతో 2021లో స్థానికులు రూ.70 లక్షల వ్యయంతో నూతన చర్చి నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఏప్రియల్ 21న వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం పాస్టర్ చిలకా ప్రభుసింగ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్నదానం చేశారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు, నిర్వాహకులు

వినుకొండ: మండలంలోని మదమంచిపాడు వీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు 4వ రోజుకు చేరుకు న్నారు. 6 పళ్ల విభాగంలో 14 జతల ఎడ్లు పాల్గొనగా చుండూరు, వేటపాలెంకు చెందిన ఆతోటి శిరీషచౌదరి, శివరామకృష్ణ చౌదరి ఎడ్లు 5448.11 అడుగులు లాగి మొదటి బహుమతి, ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకివీడుకు చెందిన సూరా పూజితరెడ్డి కి చెందిన ఎడ్లు 4720.8 అడుగులు లాగి 2వ స్థానం, దాచేపల్లి మండలం కేసనపల్లి గ్రామానికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్లు 4581.6 అడుగులు లాగి 3వ స్థానం సాధించాయి. మొదటి 9 స్థానాలు సాధించిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

యూనిట్ ఇన్‌చార్జి సాగి శ్రీనివాసరావు



అవగాహన ర్యాలీలో సిబ్బంది, విద్యార్థులు

నాదెండ్ల: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తూ అంతర పంటల ద్వారా రైతులకు ఆదాయంతో పాటూ భూమికి రక్షణ పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జి సాగి శ్రీనివాసరావు చెప్పారు. చిరుమామిళ్ల గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజొల్లా ఉండగా యూరియా దండగ.. ప్రకృతి వ్యవసాయం చేద్దాం భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలలో సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది భూమి ఆరోగ్యంగా 365 రోజులు పచ్చగా ఉంటుందన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 2025–26 ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఒక్క రైతు భూ విస్తీర్ణం, పంటలు, పాడిపశువుల వివరాలను తెలియజేయాలన్నారు. తొలకరిలో వర్షానికి ముందు కర్బనశాతం పెంపొందేలా పశు, వృక్ష వ్యర్థాలు చల్లాలన్నారు. వానపాములు వృద్ధి చెంది నేల గుల్లగా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మిరప, వరి, కంది, పత్తి పంటలకు ఎకరాకు 500 కేజీలు జీవామృతం చల్లి ప్రధాన పంటలతో పాటూ అంతరపంటలు సాగు చేసుకున్నట్లయితే రైతులకు ఆదాయం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించటం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గి చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. మంచి పోషకాలతో కూడిన ఆహారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారావు, మల్లేశ్వరి, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.